నేడు మంత్రిని కలవనున్న ఉద్యమకారులు

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి సీతక్కను కలిసి బుధవారం వినతిపత్రం అందజేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం చైర్మన్ కొట్టే శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చనున్నందున మంత్రిని కలిసి ఉద్యమకారుల గుర్తింపుకు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయాలని కోరనున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్న కార్యకర్తలు ఉదయం 9 గంటలకు టీఎన్జీవో భవన్‌కు రావాలని పిలుపునిచ్చారు.

ఇథనాల్ రాజకీయం



మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని ఆరోపిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిపై ఎదురుదాడి చేస్తున్న మాజీ మంత్రి అల్లోల (ఫైల్)

- మాజీ మంత్రి, ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం
- బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే అనుమతులు అంటూ ఎమ్మెల్యే ఎదురుదాడి
- మాజీ మంత్రి చొరవతోనే పనులు ప్రారంభమయ్యాయంటూ ఆరోపణలు
- మంత్రి కుమారుడి స్నేహితుడికి సంబంధాలున్నాయని విమర్శ
- కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందంటూ ఐకేరెడ్డి ఎదురుదాడి
- ఎమ్మెల్యే అనుచరుల హస్తం ఉందని మండిపాటు

నిర్మల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారం రాజకీయ చట్రంలో ఇరుక్కుంటోంది. ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ మాటల యుద్ధానికి ఆజ్యం పోస్తోంది. గత వారం రోజుల నుంచి ఈ రెండు పార్టీల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే చందంగా మారింది. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహకరించారని అప్పట్లో ఆయనకు సంబంధించిన పర్యావరణ శాఖనే ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చిందంటూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎదురుదాడి మొదలుపెట్టారు. గత కొద్ది రోజుల నుంచి ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు చేయడం వారి ఆందోళనలకు ఆయా రాజకీయ పార్టీలు మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. కాగా రైతులు కొద్దిరోజుల క్రితం సహనం కోల్పోయి ఫ్యాక్టరీపై దాడి చేయడమే కాకుండా ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. చిలికిచిలికి గాలివానలాగా ఈ వ్యవహారం బీఆర్ఎస్, బీజేపీలకు చుట్టుకుంది. రైతులపై కేసులు నమోదు చేయడాన్ని అన్ని పార్టీలు ఖండించాయి. రైతులకు అండగా ఉంటామంటూ కూడా ప్రకటించాయి. అయితే ఈ కేసులకు, ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎవరు బాధ్యులనే వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే సోమవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి ప్రస్తుత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని టార్గెట్ చేసుకొని విమర్శలు చేశారు. ఎమ్మెల్యే అనుచరుల కారణంగానే ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు జరుగుతోందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే ఆ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చిందంటూ మాజీ మంత్రి ఆరోపించారు. అలాగే ఫ్యాక్టరీకి సంబంధించిన భూముల కొనుగోలులో ఎమ్మెల్యే అనుచరులే ప్రధానపాత్ర పోషించారని, ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి లక్షల రూపాయలు కమిషన్‌లుగా తీసుకున్నారంటూ మాజీ మంత్రి పేర్కొన్నారు. తానూ రైతులకు అండగా ఉంటానని ప్రకటించారు. కేసులను ఎత్తివేయాలంటూ కూడా డిమాండ్ చేశారు. అయితే దీనిపై మంగళవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కౌంటర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో పర్యావరణశాఖ మంత్రిగా ఉండి ఇంద్రకరణ్‌రెడ్డి ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు నాలుగు శాఖల ద్వారా అనుమతులు ఇప్పించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి కుమారుని స్నేహితునికి ఈ ఫ్యాక్టరీలో భాగస్వామ్యం ఉందని ఆయనను మెప్పించేందుకే అప్పట్లో మాజీ మంత్రి అనుమతులు జారీ చేయించారని మహేశ్వర్‌రెడ్డి ఎదురుదాడి చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీని ఇండస్ట్రీయల్ జోన్‌లో కాకుండా పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్న విషయం పర్యావరణశాఖ మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డికి తెలియదంటే నమ్మేంత అయామకులు ఎవరూ లేరన్నారు. మొత్తం ఆయన డైరెక్షన్‌లోనే భూసేకరణ నుంచి మొదలుకొని అనుమతులు, నిర్మాణ పనుల వరకు జరిగాయంటూ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని, రైతులను వేధిస్తే చూస్తూ ఊరుకోబోమంటూ కూడా ఆయన స్పష్టం చేశారు. ఇలా ఇరువురు నేతలు ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటుండడంతో ఈ ఫ్యాక్టరీ వ్యవహారం ఇక రాజకీయ కోణంతో ముందుకు సాగబోతోందని అంటున్నారు. ఇటు బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అటు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలు ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండడంతో రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న ఆసక్తి మొదలైంది.

అనుమతుల ఆరోపణలపై బీఆర్ఎస్ ఎదురుదాడి

కాగా ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జారీ అయ్యాయంటూ ఎమ్మెల్యే, బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలను మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సవాలుగా తీసుకుంటున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే ఇథనాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన అనుమతులన్నింటిని జారీ చేసిందని, ఈ అనుమతుల వ్యవహారంలో తాము ఏమి చేసేది ఉండదని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. ఫ్యాక్టరీకి సంబంధించిన భూముల కొనుగోలు వ్యవహారంలో ఎమ్మెల్యే అనుచరులే కీలకపాత్ర పోషించారని, ఇదీ బహిరంగ సత్యమేనంటూ ఆయన ఆరోపిస్తున్నారు. ఈ భూముల కొనుగోలు వ్యవహారంలో ఎమ్మెల్యే అనుచరులు యాజమాన్యం నుంచి పెద్దమొత్తంలో కమీషన్‌లు తీసుకున్నారంటూ ఆయన విమర్శిస్తున్నారు. రైతులను రెచ్చగొడుతూ రాజకీయాలు చేయడం తగదంటూ ఆయన హితవు పలికారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, వారిని వేధింపులకు గురి చేయవద్దంటూ ఇంద్రకరణ్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. తప్పంతా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని అలాగే ఎమ్మెల్యే అనుచరులేదేనంటూ ఆయన ప్రతి దాడి మొదలుపెట్టారు. ఈ వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలను వ్యూహాత్మకంగా తిప్పికొట్టి ఎమ్మెల్యేను టార్గెట్ చేయాలన్న లక్ష్యంతో ఇంద్రకరణ్‌రెడ్డి పావులు కదుపుతుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

మాజీ మంత్రి లక్ష్యంగా..

ఇదిలా ఉండగా ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బలంగా తిప్పికొట్టేందుకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పకడ్బందీగా పావులు కదుపుతున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి బీఆర్ఎస్ పార్టీ హయాంలో అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అనుమతులన్నింటికి సహకరించారంటూ ఎమ్మెల్యే ధ్వజమెత్తుతున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కనుసైగల మేరకే ఫ్యాక్టరీ ఏర్పాటు జరుగుతోందని ఆరోపిస్తున్నారు. నాలుగుశాఖలకు సంబంధించిన అనుమతులను ఆధారాలతో సహా ఆయన ప్రదర్శిస్తున్నారు. అనుమతి పత్రాలను రైతులకు చూపి దీనికి బాధ్యులు ఎవరంటూ ఆయన ప్రశ్నిస్తున్నారు. పర్యావరణశాఖ మంత్రిగా అనుమతులు ఇచ్చి యాజమాన్యానికి వత్తాసు పలికిన ఇంద్రకరణ్‌రెడ్డి రైతుల ఆగ్రహానికి భయపడి తమపై ఆరోపణలు చేస్తున్నారంటూ మహేశ్వర్ రెడ్డి ఎదురుదాడి మొదలుపెట్టారు. అలాగే ఫాం ఆయిల్ ఫ్యాక్టరీ విషయంలో కూడా మాజీ మంత్రి అక్కడి రైతులను పక్కదోవ పట్టించారని, తన భూములకు డిమాండ్ పెంచుకునేందుకు అమాయకుల భూములను బలి చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా వ్యూహాత్మకంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిలు ఇథనాల్ ఫ్యాక్టరీపై రాజకీయ దండయాత్ర మొదలుపెట్టారంటున్నారు.

పరిస్థితులను గమనిస్తున్న కాంగ్రెస్

ఇదిలా ఉండగా ప్రస్తుతం ఇథనాల్ ఫ్యాక్టరీపై ఆందోళనలు చేస్తున్న రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటుండగా కాంగ్రెస్ పార్టీ మాత్రం వ్యూహాత్మకంగా రైతుల పక్షాన ఉంటామని ఈ వ్యవహారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామంటూ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఇప్పటికే ప్రకటించారు. రైతులకు నష్టం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకుపోయి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామంటూ శ్రీహరిరావు ప్రకటించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మాటల యుద్ధంలోకి తలదూర్చకుండా తనదైన శైలిలో అడుగులు వేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోందంటున్నారు.



లక్ష్మణచాంద రాజరాజేశ్వరస్వామి ఆలయంలో హోమం

ఘనంగా రాజ రాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

లక్ష్మణచాంద, జనవరి 9 : మండల కేంద్రంలో గల రాజ రాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవ సందర్భంగా నిర్వహించిన హోమం, ప్రత్యేకపూజలలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు ఓస రాజు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

నిర్మల్ జిల్లా చరిత్ర గ్రంథ ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అదనపు కలెక్టర్, కవులు

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : నిర్మల్ జిల్లా స్వరూపం తెలియజేస్తూ రూపుదిద్దుకున్న చరిత్ర గ్రంథం మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య ఆవిష్కరించారు. విశ్రాంతి ఉద్యోగ సంఘ భవనంలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా చరిత్రకు ఈ పుస్తకం గజిట్‌గా ఉపయోగపడుతుందన్నారు. కవులు డాక్టర్ చక్రధారి, దామెర రాములు, తుమ్మల దేవరావు, హన్మంతు, పత్తి శివప్రసాద్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, బొందిడి పురుషోత్తంరావు, వెంకట్, పోలీస్ భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



పతంగుల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్న అటవీశాఖాధికారులు

భైంసా, జనవరి 9 : నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ ఫ్లాయింగ్ స్క్వాడ్ బాసర సర్కిల్ ఫారెస్టు రేంజ్ అధికారి రమేష్ వెల్లడించారు. మంగళవారం భైంసా పట్టణంలో పతాంగుల విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో విక్రయాలను పరిశీలించారు. విక్రయిస్తున్న ధారాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఫ్లాయింగ్ స్క్వాడ్ బాసర సర్కిల్ ఫారెస్టు రేంజ్ అధికారి రమేష్ మాట్లాడుతూ చైనా మాంజా విక్రయాలు నిషేధించబడిందని వివరంచారు. పతంగుల విక్రయదారులేవరు ఎలాంటి పరిస్థితుల్లోనూ చైనా మాంజాను విక్రయించవద్దని సూచించారు. విక్రయాలు చేపట్టిన వారిపై అటవీశాఖ ఆధ్వర్యంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందులో ఫారెస్టు సెక్షన్ అధికారులు రషీద్, హర్షద్, కొటేష్‌లు పాల్గొన్నారు.

మొబైల్ సైన్స్ ల్యాబ్ విద్యార్థులకు ఉపయోగకరం



మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : జిల్లాకు మొబైల్ సైన్స్ ల్యాబ్ రావడం శుభప్రదమని దీనితో విద్యార్థులకు విజ్ఞానం అందుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంజూరైన సైన్స్ ల్యాబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఎంపిక చేసిన 9 పాఠశాలల్లో అగస్త్య ఫౌండేషన్ 2500 మంది విద్యార్థులకు సేవలందించనున్నారన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించి మెళకువలు నేర్పిస్తారన్నారు. ఎటువంటి లాభాకాంక్ష లేకుండా ఇంటెల్ వారి ఆర్థిక సహాయంతో పని చేస్తుందన్నారు. ప్రయోగాత్మక బోధనతో వారిలో సైన్స్ పట్ల అభిలాష పెరుగుతుందన్నారు. ఫౌండేషన్ మేనేజర్ బలరాం, ఏరియా మేనేజర్ శ్రీదేవి, ఎంఈవో శంకర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రారంభం

జిల్లాకేంద్రంలో మంగళవారం యాక్సన్చర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ సెంటర్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... జిల్లాలో 500ల మంది యువతకు స్కిల్ డెవల్‌మెంట్, మైక్రో ఎంటర్ప్రైజెస్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా లబ్ధిచేకూరుతుందన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, ఈడీఐఐ సంస్థ దీనిని ఆచరణలోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. నైపుణ్యాల విలువలు తెలిపారు. 18 నుండి 30 ఏళ్లలోపు ఆసక్తి గల యువత శిక్షణ పొందవచ్చునన్నారు. వివరాలకు 8374931781, 9154914703 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. డీఈవో రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

రైస్‌మిల్‌ను పరిశీలించిన కలెక్టర్

సారంగాపూర్ : మండలంలోని స్వర్ణలో గల రైస్ మిల్‌ను మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించి రైస్ మిల్‌కి ఎన్ని టన్నుల ధాన్యంను తరలించారు. వెంటది వెంట బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తున్నారా అని రైస్ మిల్ యజమానికి అడిగి తెలుసుకున్నారు. దీంతో రైస్‌మిల్‌కు సంబంధించి ట్యాక్స్‌ను గ్రామ పంచాయతీకి చెల్లిస్తున్నారా అని సంబంధిత అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎలాంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని యజమాని పేర్కొన్నారు. ఈయన వెంట అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, సీఎం శ్రీకళతో పాటు అధికారులు ఉన్నారు.

సైబర్ మోసానికి గురైన బాధితుడి కేసు ఛేదించిన పోలీసులు

- బాధితుడికి 13.19 లక్షలు చెల్లించేలా చర్యలు
- సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- విలేకరుల సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల వెల్లడి

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : సైబర్ నేరానికి గురై అనుమానితుల నుంచి వచ్చిన మెసేజ్‌లకు మోసపోయి బ్యాంకు ఖాతా నుంచి పెద్దమొత్తం 18,95,990 రూపాయల డబ్బు కోల్పోగా ఆ కేసు ఛేదించి బాధితుడికి రూ.13,19,914 రూపాయలు వచ్చేలా సైబర్ క్రైమ్ పోలీసులు కృషి చేశారని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ పట్టణం ప్రియదర్శినినగర్‌కు చెందిన అనుపోల్ల దీక్షిత్‌కుమార్ గత ఏడాది ఆగస్టు 22న బ్యాంకు ఖాతా నుంచి 18,95,990 లక్షల రూపాయలు డబ్బులు పోయినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించి బాధితుడి ఖాతా నుంచి 9 వివిధ బ్యాంకులకు డబ్బులు పంపినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దర్యాప్తులో గుర్తించిన బ్యాంకుల నుండి డబ్బులు డ్రా చేయకుండా ఉండేలా సీఐ పురుషోత్తం, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి ఆర్ఎస్సై పి. రవికుమార్ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేసేలా అధికారులకు నోటీసులు పంపి చర్యలు తీసుకున్నారన్నారు. అయితే 14 ఆగష్టు 2023న టెలిగ్రాంలో పార్ట్‌టైమ్ జాబ్ మెసేజ్ రాగానే బాధితుడు నమ్మి గుర్తు తెలియని వ్యక్తికి వివరాలు పంపించాడని తెలిపారు. వర్చువల్ అకౌంట్ క్రియేట్ చేసి బాధితుడి పేర 10 వేల రూపాయలు అతని ఖాతాలో డిపాజిట్ చేశాడని, తరువాత టాస్క్ ఇవ్వగా బాధితుడు పూర్తి చేయడంతో 1019 లాభం వచ్చినట్లు బాధితుడి బ్యాంకు ఖాతాలో అనుమానితుడు జమ చేశాడన్నారు. మరోసారి ఇలానే నమ్మించాడన్నారు. ఇదే క్రమంలో టాస్కులు పూర్తి చేస్తే అధిక లాభాలుంటాయని నమ్మించి ఆగష్టు 17 నుండి 19 వరకు పెద్ద మొత్తంలో 18 లక్షల 95 వేల 990 రూపాయలు అనుమానితుడు ఖాతాల్లోకి డిపాజిట్ చేయించుకున్నాడని పేర్కొన్నారు. తరువాత బాధితుడు అనుమానితుడి డబ్బు అడిగితే సెక్యూరిటీ డిపాజిట్ క్రింద 50 శాతం కడితే తిరిగి ఇస్తానని చెప్పడంతో తాను మోసపోయినట్లు బాధితుడు గుర్తించాడు. వెంటనే 1930కి కాల్ చేయడంతో కేసు రిజిస్టర్ చేసుకొని దర్యాప్తు జరిపారన్నారు. కోర్టు నుండి రిఫండ్ ఆర్డర్ తీసుకొని బ్యాంకు అధికారులకు అందజేసి బాధితుడి డబ్బు వచ్చేలా కృషి చేశారని వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే సమాచారం నమ్మకండి : ఎస్పీ

గుర్తు తెలియని వ్యక్తులు పంపే సమాచారం నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎస్పీ జానకి షర్మిల కోరారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు గుంజేందుకు చూస్తారని అట్టివారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసానికి గురైతే సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐ పురుషోత్తం, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి ఆర్ఎస్సై రవికుమార్, కానిస్టేబుల్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశాల్లో ఎస్పీ జానకి షర్మిల

వాహనాలపై చలాన్లకు భారీ డిస్కౌంట్ : ఎస్పీ

వాహనాలపై 2023 డిసెంబరు 25కు ముందు విధించిన చలాన్లకు భారీ డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ... ఈ అవకాశాన్ని వాహనదారులు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం రూ. 5,59,280 చలాన్లు ఉండగా కేవలం 1,25,321 రూపాయలు మాత్రమే చెల్లించారన్నారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలపై 80, ఫోర్‌వీలర్లు 60 శాతం, బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. నేటి వరకే చెల్లింపుకు అవకాశం ఉందన్నారు.

24 మొబైల్ ఫోన్లు అందజేత...

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన 24 మందికి మొబైల్ ఫోన్లను ఎస్పీ జానకి షర్మిల అందజేశారు. ఇప్పటి వరకు 421 ఫోన్లు యజమానులకు అందజేశారు. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నేరస్తులు దొంగిలిస్తే వాటిని దుర్వినియోగపరిచే అవకాశాలున్నాయన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ఉపయోగించుకోవాలని సూచించారు. డీఎస్పీ గంగారెడ్డి, సీఐ పురుషోత్తం చారి, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించండి

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : నిర్మల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. మంగళవారం అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌కు విద్యార్థి నాయకులు వినతిపత్రం అందజేశారు. కన్వీనర్ శివకుమార్ మాట్లాడుతూ... మరుగుదొడ్ల, మూత్రశాలలు సౌకర్యం లేదని, మధ్యాహ్న భోజనం సరిగ్గా అందడం లేదన్నారు. విష జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. నూతన భవనాలు ఏర్పాటు, కాస్మొటిక్స్ చార్జీలు పెంపు, స్వీపర్ల నియామకం తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. సాయినాథ్, దినేష్, లక్ష్మణ్, శశి, నితేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : జిల్లా కేంద్రంలోని గాజులపేట 11 కేవీ ఫీడర్ మరుమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గాజులపేట, కొమ్ము నారాయణ రైస్ మిల్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు దివ్యగార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సీఈవో సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

డాక్టర్ పోస్టులకు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టుల నియామకానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆసుపత్రి సూపరెండెంట్ ఒక ప్రకటనలో కోరారు. గైనకాలజిస్ట్ 2, జనరల్ సర్జన్ 1, పీడియాట్రిషన్ 2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 6 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన నియమించనున్నట్లు తెలిపారు. ఈ నెల 11 నుంచి 18 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : ఎస్టీయూ రూపొందించిన డైరీ, క్యాలెండర్ మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని మహేశ్వర్‌రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నాయకులు భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్, జుట్టు గజేందర్, సిరాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యాకరణ ప్రజ్ఞాపరీక్ష

నిర్మల్ కల్చరల్, జనవరి 9 : ఈ నెల 10న ముథోల్‌లోని రబింద్ర హైస్కూల్‌లో వ్యాకరణ ప్రజ్ఞా పరీక్ష నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ చిమ్మపూడి ఫౌండేషన్ భైంసా డివిజన్ కన్వీనర్ జాదవ్ పుండలిక్‌రావు పాటిల్ తెలిపారు. మధ్యాహ్నం జరిగే ఈ పరీక్షకు పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్ నెంబర్ 9441333315 సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ నమోదు సక్రమంగా చేయాలి



ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదును పరిశీలిస్తున్న యంపీవో శ్రీనివాస్‌గౌడ్

నర్సాపూర్(జి), జనవరి 9 : ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు గతనెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి 8211 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలనా ఆరు గ్యారంటీలతో పాటు ఇతర దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం నాటికి 2901 అప్లికేషన్లు కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు.



తేమ మీటర్ ద్వారా పంట తేమ శాతం చూస్తున్న సీఈవో

కందులను రైతులు గిట్టుబాటు ధరకే అమ్ముకోవాలి : సీఈవో కాంబ్లే

ఉట్నూర్, జనవరి 9: రైతులు పండించిన కందులను తొందరపడి మధ్య వర్తులకు తక్కువ ధరలకు అమ్ముకొని నష్టపోవద్దని రైతు పంట ఉత్పత్తుల కమిటీ సీఈవో కాంబ్లే ప్రజ్ఞశీల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలం చిన్నగంగాపూర్, అల్లిగూడ, కామైపేట్, గంగాపూర్ గ్రామాలలో సీఈవో, సీసీలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. అక్కడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేషనల్ అగ్రి కల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (నాఫెడ్) ప్రమాణాలను పాటించడం ద్వారా మంచి ధరలకే తమ పంటలను అమ్ముకోవచ్చని.. నేరుగా రైతుల ఖాతాలలో నగదు జమ అవుతుందని అన్నారు. రైతులు తాము పండించిన కందులను బాగా ఆరబెట్టడం ద్వారా తేమ శాతం 12 శాతం ఉండాలని, నాఫెడ్ నాణ్యత ప్రమాణాలు పాటించి అధిక ధరలకు పంటను అమ్ముకోవాలని కాంబ్లె ప్రజ్ఞశీల్ సూచించారు. మరింత సమాచారం కోసం ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండల సమాఖ్యనందు సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ జాడి రాజేశ్వర్, వీవోఏ చంపత్‌రావు, లక్ష్మి, చరణ్, గ్రామపటేల్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజ్ఞశీల్

సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయండి : కార్యదర్శి దర్శనాల

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 9: ఈనెల 10న స్థానిక సుందరయ్య భవనంలో జరిగే జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ప్లీనరీ సమావేశానికి సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లి, సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా ఇన్‌చార్జి బండారు రవికుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం 6 గ్యారెంటీలను అమలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. సీసీఐ పునర్ ప్రారంభించాలని, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్‌వేసి, విమానాశ్రయాన్ని నిర్మించాలన్నారు. అలాగే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి మాంగనీస్ ఆధారిత ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులు అడ్డుకున్నా రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్లీనరీలో తీర్మానం చేసి వాటి అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం కోసం, కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దర్శనాల మల్లేష్

ప్రభుత్వ పథకాలతో అర్హులకు లబ్ధి : ఎంపీపీ

మావల, జనవరి 9: ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల్లో అర్హులకు తప్పనిసరిగా లబ్ధి చేకూరేలా చూడాలని ఎంపీపీ దర్శనాల సంగీత అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మేరకు అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మురుగు కాలువలు, అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేయాలని మండల పరిషత్తు పాలకవర్గం తీర్మానించింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మావల, బట్టిసావర్గాం, వాగాపూర్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు బంధు నిధులు ఎంతమంది రైతుల ఖాతాల్లో విడుదలయ్యాయి? మిగతా వారికి ఎప్పుడు జమ అవుతాయని ఆరా తీశారు. ఇందులో వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో సునీత, ఎంపీపీ లక్ష్మణ్, తహసీల్దార్ వేణు గోపాల్, సర్పంచ్‌లు దొగ్గాలి ప్రమీల, రాగం గంగమ్మ, మయూరి పాల్గొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

మావల, జనవరి 9: భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సయ్యద్ ముజాహిత్ వివరాల ప్రకారం.. భీంసారి గ్రామానికి చెందిన జక్కుల చంద్ర కుమార్ మేస్త్రీ పని చేస్తుంటాడు. కొన్ని రోజులుగా పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్యపై అనుమానం పెంచుకొని నిత్యం వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి ఈ విషయమే మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. ఆవేశంతో భర్త చంద్రకుమార్ తన భార్యను పిల్లల ముందే బ్లేడ్‌తో గొంతు కోశాడు. కేకలు వేసిన పిల్లలు స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం భార్య తన భర్తపై మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించామని ఎస్సై తెలిపారు.

బుద్ధ విహార్‌లో విద్యుత్ మోటర్ చోరీ

బోథ్, జనవరి 9: సోనాల మండల కేంద్రంలోని బుద్ధ విహార్ విద్యుత్ మోటార్ చోరీ అయిందని స్థానిక పోలీస్ స్టేషన్లో బుద్ధ విహార్ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి బుద్ధ విహార్‌లో ఉన్న బోరు బావి నుంచి విద్యుత్ మోటర్‌తో పాటు పైప్‌లైన్‌ను దొంగిలించారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని ఒకరి మృతి



లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం.. గామేవాడ్ రవి మృతదేహం

నర్సాపూర్(జి), జనవరి 9 : మండలంలోని చాక్‌పల్లి గ్రామం వద్ద మంగళవారం ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నుంచి భైంసాకు పత్తిలోడుతో వెళ్తున్న ఎపీ39టీబీ 4959 లారీని భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఎమ్‌హెచ్26బీపీ5525 ద్విచక్ర వాహన చోదకుడు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. లారీ ముందర టైరులో ద్విచక్ర వాహనం ఇరుక్కు పోవడతో ఇరవై మీటర్ల పొడవు ఊడ్చుకుపోయింది. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఆదార్‌కార్డు పర్సులో ఉండటంతో ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి కొత్త అందేగాం గ్రామానికి చెందిన గామేవాడ్ రవి నాందేడ్ జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని హైవే అధికారులు స్పందించి రోడ్డువెడల్పు చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చాక్‌పల్లి వాసి గొంద్రసాగర్ కోరారు.

గుండంపెల్లిలో రెండు బైకులు ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్, జనవరి 9 : మండలంలోని గుండంపెల్లిలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రత్నాపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన గుమ్ముల గణేష్ తన ద్విచక్ర వాహనంపై టెం బుర్ని వైపు వెళ్తుండగా మహారాష్ట్రకు చెందిన ఇటుక బట్టీ కార్మికులు తమ ద్విచక్ర వాహనంపై గుండంపెల్లి వైపు రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న గుమ్ముల గణేష్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గుమ్ముల గణేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రకు చెందిన మరో యువకుడికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరినీ 108 అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై యాసిన్ అరాఫత్ తెలిపారు.

అధికారులపై ఎమ్మెల్యే బొజ్జు ఆగ్రహం

ఖానాపూర్, జనవరి 9 : అధికారుల తీరుపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆగ్రహం వ్యక్త చేశారు. ఖానాపూర్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఖానాపూర్ ఎంపీపీ అబ్దుల్ మోహిద్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల పనితీరు పట్ల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సదర్మాట్ రైతులకు నీళ్ల ఇవ్వకుంటే ఎవరిని వదిలేది లేదన్నారు.



పూసాయిలో భక్తులు స్నానాలు చేసే కోనేరు



జాతరకు ముస్తాబైన పూసాయి ఎల్లమ్మ ఆలయం

రేపటి నుంచి పూసాయి ఎల్లమ్మ మహా జాతర

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామస్థులు



పూసాయిలో వెలిసిన రేణుకా ఎల్లమ్మ

జైనథ్, జనవరి 9: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పూసాయి గ్రామంలో వెలసిని రేణుక ఎల్లమ్మతల్లి ఆలయం ఈనెల 11వ తేదీన పుష్య మాస అమావాస్య నుంచి ఫిబ్రవరి 12 మాగ మాసం వరకు నెల రోజుల పాటు సాగే జాతరకు పూసాయి ఎల్లమ్మ ఆలయం అందంగా ముస్తాబైంది. ఇందుకు గ్రామ సర్పంచ్ అల్లూరి పోతారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను సైతం చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయాన్ని రంగురంగుల పూలు పెంట్‌లతో అలంకరించారు. భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్లను చేశారు. ఈ జాతరకు తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని పాంఢ్రకోడ, యావత్‌మాల్, బోరి జిల్లాలోని ఆయా గ్రామాల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఎల్లమ్మ దేవికి బోనాలు సమర్పించి ప్రత్యేక మొక్కులను తీర్చుకుంటారు.

- పుష్యమాసం ప్రత్యేకం

పుష్యమాస అమావాస్య రోజు గ్రామస్థులంతా భజా భజంత్రీలు, డప్పులు భాజాల మధ్య గ్రామ మహిళలు భక్తులు ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి అభిషేకం చేసి నైవేద్యం సమర్పిస్తారు.

- పూసాయిలో కోనేరు ప్రత్యేకత

ఎల్లమ్మ తల్లి గర్భగుడి నుంచి వచ్చే జలధ కోనేరులో భక్తులు స్నానమాడిన చర్మ రోగాలు నయమవుతాయని గ్రామస్థుల ప్రగాఢ నమ్మకం. దీంతో పాటు వంట పొలంలోని వివిధ పంటలకు చీడపీడలు ఆశించిన పంటలకు కోనేరు నీటిని చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్థులు అపార నమ్మకం.

భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తాం

: అల్లూరి పోతారెడ్డి, పూసాయి గ్రామ సర్పంచ్



జైనథ్ మండలంలోని పూసాయి గ్రామంలో ఈనెల 11వ తేదీ గురువారం పుష్య మాసం నుంచి మాగమాసం వరకు నెల రోజుల పాటు మహాజాతర నిర్వహించ తలపెట్టా. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం.

'పేదల సంక్షేమం కోసమే కేంద్ర పథకాలు'

బోథ్, జనవరి 9: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో 14 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలో పేద ప్రజలకు సరైన వైద్యం అందాలనే దృక్పథంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆధునాతన సౌకర్యాలతో ఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందన్నారు. అందులో కిడ్నీకి సంబంధించిన వ్యాధిగ్రస్తులు వైద్యం చేసుకునేందుకు అధునాతనమైన యంత్రాలను సమకూర్చడం జరిగిందన్నారు. ఇందులో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింబాజీ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నవీన్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, ఐటీడీఏ డైరెక్టర్ మిశ్ర భూమన్న, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులున్నారు.

- మారుమూల గ్రామాల అభివృద్ధికి నిధులు

బోథ్: మారుమూల గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నేరేడుపల్లి, పాట్నాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నేరేడుపల్లి గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గ్రామస్తులు తమ గ్రామానికి వచ్చేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదని తాము రూ.30 వేలతో తాత్కాలిక రోడ్డు వేసుకున్నామని వివరించారు. వారి విన్నపం మేరకు రెండు లక్షల రూపాయలు మంజూరు ఇవ్వడం జరుగుతుందని, ఈ నిధులతో కల్వర్టుకు ఇరువైపులా సీసీ రోడ్డు వేయించుకోవాలని సూచించారు.

అలాగే, బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎంపీ బాపూరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని సాయి నగర్ కాలనీలో అనారోగ్యం పాలైనా ఏబీవీపీ సీనియర్ నాయకులు అవునూరి శ్రీనివాసరావును ఆయన పరామర్శించారు.

వాహన రాకపోకల కోసం గ్రామానికి తాత్కాలిక రహదారి

బోథ్, జనవరి 9: మండలంలోని మారుమూల ఆదివాసి గిరిజన గ్రామమైన నేరేడుపల్లికి వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. అయితే వేసవి కాలంలో సైతం వాహనాలు గ్రామంలోకి వచ్చేందుకు రోడ్డు సరిగ్గా లేకపోవడంతో గ్రామానికి చెందిన గిరిజనులంతా కలిసి సమావేశమై రోడ్డు నిర్మాణానికి తీర్మానించుకున్నారు. అందుకు ప్రతీఇంటికి రూ.2వేల చొప్పున సమకూర్చి రోడ్డు నిర్మాణానికి ఉపక్రమించారు. దాదాపు కిలోమీటరు వరకు స్థానికంగా లభించే మొరం వేసి రోడ్డును ఏర్పాటు చేసుకుని వాహనాల రాకపోకకు అంతరాయం లేకుండా రోడ్డును పూర్తి చేసుకున్నారు. అయితే గత వర్షాకాలంలో గ్రామానికి అంబులెన్స్ రాకపోవడంతో పడ్డ కష్టాన్ని గమనించి కనీసం వేసవి కాలంలోనైనా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావడానికి ఈ రోడ్డును పూర్తి చేసుకోవడం జరిగిందని స్థానిక గ్రామస్థులు తెలిపారు.



నేరేడుపల్లి గ్రామానికి వెళ్లే తాత్కాలిక రోడ్డు

'ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించే వరకు పోరాడుతా'

నిర్మల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్ మండలంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి గత ప్రభుత్వంలో పర్యావరణ మంత్రిగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్ని అనుమతులు మంజూరు చేశారని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ అనుమతుల మంజూరులో అప్పటి మంత్రి తనయుడి ప్రోత్బలం కూడా ఉందని ఆరోపించారు. మంగళవారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో తనపై మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా ఆయన తిప్పి కొట్టారు. ఇథనాల్ ఫ్యాక్టరీని ఇక్కడి నుంచి తరలించి, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసే వరకు రైతులతో కలిసి పోరాడుతామన్నారు. దమ్ముంటే ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ఈ పోరాటంలో మాతో కలిసి వస్తారా అని సవాల్ విసిరారు. కాగా మాజీ మంత్రి అల్లోల కుటుంబం ఇదే దిలావర్‌పూర్ మండలంలో చక్కెర పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి గతంలో వందలాది ఎకరాల విలువైన భూములను రైతుల నుంచి సేకరించారన్నారు.

బాసర మాస్టర్‌ప్లాన్‌పై కదలిక

- కొత్త ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన దేవస్థాన అధికారులు
- పనుల కోసం టెండర్లు వేయాలని మంత్రి ఆదేశం



దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు బాసర మాస్టర్‌ప్లాన్ గురించి వివరిస్తున్న అధికారులు

బాసర, జనవరి, 9 : కొత్త ప్రభుత్వంలో బాసర దేవస్థాన మాస్టర్‌ప్లాన్‌పై కదలిక వచ్చింది. గత పదేళ్ల నుండి వాయిదాలు పడుతూ వస్తున్న మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులపై మరోసారి చర్చ మొదలైంది. దాదాపు ఏడాది క్రిందట అప్పటి దేవాదాయశాఖ మంత్రి ఇతర ప్రముఖులు ఆర్భాటంగా శంకుస్థాపన చేసి వదిలేసిన పనులపై ఆశలు చిగురిస్తున్నాయి. మంగళవారం హైదరాబాద్‌లో ఆలయ ఈవో విజయ రామారావు ఆధ్వర్యంలో దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులు దేవాదాయ శాఖ అధికారులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. బాసర దేవస్థానం మాస్టర్‌ప్లాన్ పనుల విషయంలో వాయిదాలు పడడం తదితర విషయాలను మంత్రి దృష్టికి తెచ్చారు. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికి టెండరు ప్రక్రియ వద్ద నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ గురించి మంత్రికి వివరించారు. దేవాదాయ శాఖతో పాటు వాస్తు పరంగా శృంగేరి పీఠం సూచనలకు అనుగుణంగా రూపొందించిన నూతన ఆలయ నమునాను మంత్రికి వివరించారు. మాస్టర్ ప్లాన్ కోసం మొదటి విడతగా గత ప్రభుత్వం విడుదల చేసిన రూ. కోట్లలో కోట్లు నిధులు జిల్లా కలెక్టర్ వద్ద ఉన్నాయనే విషయాన్ని మంత్రికి తెలిపారు. దీంతో మంత్రి వెంటనే టెండర్లు నిర్వహించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు ఫోన్‌లో ఆదేశించినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు






బాసర, జనవరి, 9 : బాసర ఆర్జీయూకేటీలో అధికారులు పీయూసీ - 2 విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు సంప్రదాయ, ఇతర సంగీత పాటలపై చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు.

ఆర్‌టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

భైంసా, జనవరి 9 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ఆర్‌టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతతో కృషి చేస్తామని ఆర్‌టీసీ ఆదిలాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ప్రవీన్, ప్రణీత్‌లు హామీ ఇచ్చారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో భైంసా బస్సు డిపోలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహాలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఆర్‌టీసీ కండక్టర్లు, డ్రైవర్లు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సంస్థ ఉద్యోగులందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్య జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. సంస్థ బస్సుల ద్వారా ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. బస్సుల నిర్వాహణ వ్యవస్థను పూర్తి స్థాయిలో మెరుగుపరచి ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. ప్రయాణీలకుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. ఇదే క్రమంలో భైంసా డిపో పరిధిలో నెలకొని ఉన్న సమస్యలను ప్రాధాన్యాతనుసారం పరిష్కరిస్తామని వెల్లడించారు.వసతులు, సౌకర్యాలు మెరుగుపరుస్తామని వివరించారు. టీమ్స్ మిషన్ల సమస్యలు త్వరలోనే పరిష్కరమవుతాయని పెర్కొన్నారు. పెండింగ్‌లోనున్న రెండు పీఆర్‌సీలు, బాండ్ డబ్బులు, డీఏ ఏరియర్స్ అంశాలను సంస్థ ఎండీ దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింప చేసేందుకు పాటుపడుతామని తెలిపారు. ఈ సందర్భంగా రీజనల్ అధికారులు డిపో కార్మికులతో మమైకమే నడిచారు. కార్మికులతో సాముహిక భోజనాలు చేశారు. ఇందులో డిపో మేనేజర్ అమృత, అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ చందు, వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు ,డిపో పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాస్టల్‌ను మంజూరు చేయాలి

కుభీర్, జనవరి 9 : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను మంజూరు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళశారం ఎంఆర్‌వో సోముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ 365 మంది విద్యార్థులు చదువుతున్నారని, బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



- జిల్లా నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సమావేశం
- ఎన్నికల్లో ఓటమి పాలైన నేతలకే ఇన్‌చార్జి బాధ్యతలు
- నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధుల మంజూరీకి ముఖ్యమంత్రి ఆమోదం
- ఈనెల 26 తర్వాత ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ
- పార్లమెంట్ ఎన్నికలపై జిల్లా నేతలకు దిశానిర్దేశం!

సీఎం రేవంత్.. డైరెక్షన్



ఆదిలాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా జిల్లా నేతలతో సమావేశం కావడం రాజకీయ పరంగా ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తుంది. ఈసారి ఎలాగైనా పార్లమెంట్ స్థానాన్ని గెలిచి తీరాలనే తపనతో కాంగ్రెస్ కనిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను నియమించింది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు పాక్షికంగా కొనసాగుతున్నాయి. ఈ నాలుగు నియోజక వర్గాల్లో ఖానాపూర్ తప్ప. మరే నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేదు. అయిన పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. సోమ వారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమై జిల్లా రాజకీయ పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి, ఇతర సమస్యలపై ఆరా తీసినట్లు తెలిసింది. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గం నుంచి ఆడె గజేందర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల వరకు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ, ఇతర ముఖ్య నేతలు పార్టీలో చేరిపోయారు. త్వరలోనే జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మరికొంత మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీలో చేరేందుకు సిద్ధం కావడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో చేరికలు జరిగేలా నేతలు సన్నద్ధమవుతున్నారు.

పార్టీ అభ్యర్థులే ఇన్‌చార్జీలు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన పార్టీ అభ్యర్థులే ఇకపై నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా కొనసాగుతారు. వారిచ్చిన సిఫారసు మేరకే నియోజకవర్గానికి నిధులు, ఇతర అభివృద్ధి పనుల మంజూరు, అధికారుల బదిలీలను చేపట్టనున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గంలో ఆడె గజేందర్‌లు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు. కానీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలు కావడంతో ప్రత్యేకదృష్టిని సారిస్తోంది. బోథ్‌లో బీఆర్ఎస్, ఆదిలాబాద్‌లో బీజేపీ గెలువడంతో కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. దీంతో పార్టీ ఇన్‌చార్జీలను ముందుంచి పలు రకాల అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యతను పార్టీ ఇన్‌చారీలకు అప్పగించింది. వారి సలహా, సూచనల మేరకే పార్టీలో కొత్త చేరికలు ఉంటాయ ని స్పష్టం చేసింది. ఓడిపోయిన అభ్యర్థులకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంతో నియోజకవర్గస్థాయి అధికారులు, ఇతర ముఖ్య నేతలు కాంగ్రెస్ పారీ ఇన్‌చార్జీల చుట్టు చక్కర్లు కొడుతున్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జిల్లా నేతలు(ఫైల్)

ప్రతిపాదనలు సిద్ధం

అడిగిన వెంటనే ప్రభుత్వం ఆమోదం తెలుపడంతో జిల్లా నేతలు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. ఈ నిధులతో అత్యవసర పనులను చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఉట్నూర్‌కు వచ్చినట్లే వచ్చి చేజారిపోయిన గిరిజన యూనివర్సిటీతో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ నేతలు సూచించడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు నోచుకోవడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుప్టి ప్రాజెక్టు, బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు నిధులను విడుదల చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఎన్నో మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందడం లేదని చెప్పడంతో ప్రభుత్వం నిధుల మంజూరుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.

సీఎం సెంటిమెంటుగా ఇంద్రవెల్లి

సీఎం రేవంత్‌రెడ్డి సెంటిమెంటుగా భావించిన ఇంద్రవెల్లి నుంచే పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి ఇంద్రవెల్లిలోనే భారీ బహిరంగ సభను నిర్వహించి సక్సెస్ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చింది. అదే ఆనవాయితీని కొనసాగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 26 తర్వాత ఇంద్రవెల్లిలో పర్యటించి నాగోబాను ప్రత్యేకంగా దర్శించుకోనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభను నిర్వహించి జిల్లాల పర్యటనను చేపట్టనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. అదేరోజు ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతి వనానికి భూమిపూజ చేయనున్నారు. ఇప్పటికే గ్రామసభను నిర్వహించిన అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉమ్మడి జిల్లాను దత్తత తీసుకుంటున్నట్లు అధికారిక ప్రకటన చేయనున్నారు. జిల్లా నుంచే గృహజ్యోతి, ఇతర ముఖ్యమైన పథకాల అమలుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేకదృష్టిని సారిస్తోంది.



మేడిగూడ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న డీఈవో ప్రణీత

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలి : డీఈవో

పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక కళనువెలికి తీసే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుని పై ఉందని ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి టి.ప్రణిత అన్నారు.మంగళవారం జైనథ్ మండలంలోని మేడిగూడ(సి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కాంప్లెక్స్ హెచ్ఎం పొద్దుటూరిలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో గెలుపొందిన పాఠశాలల విద్యార్థులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి రాంచందర్, జిల్లా విద్యాశాఖ అధికారులు కంటెనర్సయ్యనారాయణ,శ్రీకాంత్, హెచ్ఎం సర్యవాన్ చిక్టెలతో పాటు ఆయా గ్రామాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం : తుడుందెబ్బ

బోథ్, జనవరి 9: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షులు కోడప నగేష్ పేర్కొన్నారు. మంగళవారం తుడుం దెబ్బ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చి విలేకరులతో మాట్లాడారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేంతవరకు రాజ్యాంగబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 342 ఆర్టికల్‌కు విరుద్ధంగా చట్టసభలో ఆమోదం లేని లంబాడాల వలన తెలంగాణ రాష్ట్ర రిజర్వేషన్లు ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆదివాసులకు న్యాయం జరిగేంత వరకు ప్రజా రాజకీయ న్యాయపోరాటాలను శాస్త్రీయ పద్ధతిలో చేపడుతామన్నారు. కనీస సౌకర్యాలు లేవని జిల్లా ఉన్న తాధికారులు స్థానిక శాసనసభ్యులు చూపి సమస్యలను పరిష్కరించాలన్నారు. విలేకరుల సమావేశంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పెట్టి మనోజ్, ప్రధాన కార్యదర్శి నైతం రమేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్రం జంగు, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గ, జిల్లా డివిజన్ అధ్యక్షులు సలాం వరుణ్, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సర్పంచ్ అరక యాదవరావు, సార్ మేడి మడవి గంగారం పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న జడ్పీటీసీ

సీఎంను కలిసిన జడ్పీటీసీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 9: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తలమడుగు జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లోని సీఎంవో కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, స్థానిక నాయకులు, తదితరులున్నారు.

జిల్లాపై కొనసాగుతున్న చలి ప్రభావం

- సిరికొండలో 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): డిసెంబరు మాసం ముగిసిపోయిన ఆదిలాబాద్ జిల్లా పై చలి ప్రభావం కొనసాగుతుంది. మంగళవారం జిల్లా సాధారణ గరిష్ఠ ఉష్ణోగ్రత 32.3 డిగ్రీలు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 13.7 డిగ్రీలుగా నమోదైంది. అత్యల్పంగా సిరికొండ మండలంలో 11.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు, బోథ్‌లో 12.0, భీంపూర్‌లో 12.3, జైనథ్‌లో 13.1, ఉట్నూర్‌లో 13.3 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల 20 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగలంతా ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం చల్లబడింది. రాత్రి సాయంత్రం వేళల్లో చలి ప్రభావం కనిపిస్తుంది. జనవరి మాసంలో కనిపిస్తున్న చలితో పంటలపై ప్రభావం పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. చీడపీడలు, ఉధృతి పెరిగే అవకాశం ఉందంటున్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆదివాసీ హక్కుల పోరాట సమితి మండల కార్యవర్గం ఏర్పాటు

బోథ్, జనవరి 9: బోథ్ మండలం ఆదివాసీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. బోథ్ డివిజన్ అధ్యక్షుడు ధ్రువ విశ్వేశ్వర్‌రావు అధ్యక్షతన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల అధ్యక్షుడిగా కనక అమృతరావు, రావెల్లి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంగారపు మహేష్, ఉపాధ్యక్షుడిగా మడావి మనోహర్, ఉపాధ్యక్షుడు సందీప్, శంకర్, సురేష్, ప్రధాన కార్యదర్శిగా మండాడి రాము, కోశాధికారిగా సుందన్న, కార్యదర్శులుగా నల్లాల శ్రీకాంత్, మోహన్, ప్రచార కార్యదర్శిగా అరక శ్రీనివాస్, సభ్యులుగా అవినాష్, కేశవ్, దేవరావులు ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం



వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఇంద్రవెల్లి, జనవరి 9: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్త అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి సందర్శించి ప్రజా పాలన దరఖాస్తులతో పాటు అన్‌లైన్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం వచ్చిన దరఖాస్తులు 12 వేల 272 వచ్చాయని, అందులో 4,630 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయితీలో జేపీఎస్ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారి వివరాలను తెలుసుకున్నారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని, ఆన్‌లైన్ వివరాలు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీపీ సంతోష్ కుమార్, తదితరులు ఉన్నారు.

16 వరకు పత్తి కొనుగోళ్ల నిలిపివేత : మార్కెట్ కార్యదర్శి

బోథ్, జనవరి 9: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని సోనాల, నేరడిగొండ జిన్నింగ్‌లలో ఈనెల 10 నుంచి 16 వరకు పత్తి పంట కొనుగోలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న తెలిపారు. ఈ రెండు జిన్నింగ్‌లలో పత్తి నిల్వలు పేరుకుపోయినందున సీసీఐ కొనుగోలు చేపట్టరాదన్నారు. కాగా బోథ్ జిన్నింగ్‌లలో కొనుగోలు ఉంటాయన్నారు.

గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలి : ఎంపీడీవో

తాంసి, జనవరి 9: ఆయా గ్రామంలోని కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపీడీవో భూమయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల దోమల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశాలు ఉన్నాయని గ్రామాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలన్నారు. చలి తీవ్రత కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా తాగునీటి పథకాలలో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు వర్షాభావ పరిస్థితుల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల చుట్టూ చెత్తాచెదారం లేకుండా చూడాల్సిన బాధ్యత గామ కార్యదర్శులదేనని, 24 గంటల పాటు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

ఆగస్టులోగా అభివృద్ధి పనులు పూర్తి

- ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులు
- స్టాఫ్ క్వార్టర్లు, ఆసుపత్రి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫిట్‌లైన్ పనుల పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 9: అమృత్ భారత్ పథకంలో ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలతో పాటు ఇతర పనులు కొనసాగుతున్నాయని, వచ్చేజూన్ ఆగస్టులోగా ఆ పనులు పూర్తవుతాయని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం అర్.ధనుంజయులు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించి వసతులు, పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ క్వార్టర్లు, ఆసుపత్రి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫిట్‌లైన్‌పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు రైల్వే స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏజీఎం ధనుంజయులు మాట్లాడుతూ ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా పనులు జరుగుతున్నాయన్నారు. దాదాపు రూ.23 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పిట్‌లైన్ ఇతర పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మరిన్ని లైన్స్ వేసి జిల్లా నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను నడిపేలా ప్రణాళికలు చేశామన్నారు. ప్రయాణికులకు ఆహ్లాదం కల్పించేలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేలా కృషి చేస్తామన్నారు.



రైల్వే స్టేషన్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏజీఎం

భీం ప్రాంగణంలో సుందరీకరణ పనులు

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి

ఉట్నూర్, జనవరి 9: మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేలా చేయడానికి సుందరీకరణ పనులు చేపట్టడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి అన్నారు. మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కుమురంభీం ప్రాంగణాన్ని (కేబీ కాంప్లెక్స్) సుందరంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. కేబీ కాంప్లెక్స్‌లో రాజమండ్రి నుంచి తెప్పించిన అరుదైన మొక్కలు నాటి సుందరీకరణ పనులను శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ చాహత్‌బాజ్‌పాయి మాట్లాడుతూ కుమురంభీం కాంప్లెక్స్ ద్వారం నుంచి విగ్రహం వరకు పరిసరాలు, పీఎంఆర్‌సీ గెస్ట్ హౌజ్, మీటింగ్ హాల్ పరిసరాల్లో అలంకరణ పూల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. రాజమండ్రి నుంచి తెప్పించిన క్రోటాన్స్, బోగన్విల్లియా, టెర్మినేలియా, యుక్కా, మహాత్మా డ్రసినా, టెంపుల్ ట్రీ, ఫాక్స్‌టైల్ పాం వంటి మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాథోడ్‌బీంరావ్, పీహెచ్ఓ సందీప్ కుమార్, అధికారులు, తదిరులు పాల్గొన్నారు.



కొమురంభీం ప్రాంగణంలో మొక్కలు నాటిన పీవో

క్రీడల ఏర్పాట్ల పరిశీలన

ఈనెల17 నుంచి భీం ప్రాంగణంలో నిర్వహించనున్న ఎంటర్ సొసైటీ లీగ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొముురంభీం ప్రాంగణంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న క్రీడ స్థలాల పనులను పరిశీలించారు. క్రీడలకు అవసరమయ్యే విధంగా మైదానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాథోడ్ భీమ్‌రావు, డిప్యూటీ ఈఈ శివప్రసాద్, ఏఈ ఇందల్, జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారధి, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్‌నాయక్, తదితరులున్నారు.

కూలీలు దొరక్క.. పత్తి తీయక!

జిల్లాలో తెల్ల బంగారంగా పిలిచే పత్తి పంటను తీసేందుకు కూలీల కొరత పత్తి రైతులను తీవ్రంగా వేధిస్తోంది. పంట చేనులో పత్తి విరగబూయడంతో దానిని తీసేందుకు రైతులు అపసోపాలు పడుతున్నారు. స్థానిక కూలీలు దొరక్కపోవడంతో అనేక మంది రైతులు మహారాష్ట్రకు వెళ్లి అక్కడి వారిని తీసుకొస్తున్నారు. అయితే, మరో నెల దాటితే యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

(- ఆంధ్రజ్యోతి, ఫొటోగ్రాఫర్)





జిల్లాలో పత్తి ఏరేందుకు కూలీలు దొరక్క పోవడంతో పంట చేనులో అలాగే ఉండిపోయిన పత్తి